# ఓనమాలు

విజ్ఞాన యాత్ర అని బ్యానర్‌వున్న స్కూలు విద్యార్థుల వ్యాన్, వారం సరిపోను వంట సామాగ్రితో బయలుదేరి, కొండ ప్రాంతంలో పరుగెడుతూంది. రోడ్డు మలుపు ప్రక్కన " నిదానం - ప్రధానం" అని బోర్డు వుంది. కొందరు దానిని పెద్దగా చదివారు. మరికొందరు చూసి వదిలారు.

" ఆ బోర్డు చూశారా?" టీచర్ ప్రశ్నించాడు.

" చూశాం సార్" పిల్లలు చెప్పారు.

" దాని అర్థం మీకు తెలుసుకదా?" తెలుసన్నట్టు తలలూపారు.

" ఏమయ్యా డ్రైవర్‌గారూ! నీకూ తెలుసు కదా?"

" అది రాసింది మా కోసమేనాయె" వెనక్కుమళ్లి చిరునవ్వుతో అన్నాడు డ్రైవర్.

" సరే కాని కాస్త ముందుకే చూడు రోడ్డు బాగాలేదు" నవ్వుతూ అన్నాడు టీచర్

"ఇక్కడిది మీ కోసమే కావచ్చు, కాని ఆ వాక్యం అందరికీ వర్తిస్తుంది."

" ఏ పనిలోనైనా నిదానం అవసరం" అందరి వైపు చూస్తూ అన్నాడు టీచర్.

" అన్ని పనుల్లో నిదానం అంటే, మరి పనులు కావడం కుదరదు అనుకుంటా సార్"

"అన్ని పనులంటే, పనిని బట్టి వుంటుంది తినేటపుడు నిదానంగా తినాలి, చదివేటపుడు శ్రద్ధగా చదవాలి, మాట్లాడేటప్పుడు విషయాన్ని

బట్టి, ఎదుటివారికి అర్థమయ్యే పదజాలంతో మాట్లాడాలి, నిదానంగా నడవాలి అనుకున్న చోటుకి సకాలంలో చేరాలి అని తొందర తొందరతో పరిగెత్తి సమస్యలు కొని తెచ్చుకునే కంటే బయలుదేరేటపుడు కాస్త ముందుగ బయలుదేరాలి. పిల్లలూ జీవితంలో తెలుసుకోవలసింది. చాలా వుంది మీరు పెరుగుతూ కేవలం చదివితేనే సరిపోదు. చదువు తెలిపే రహస్యాన్ని తెలుసుకోవాలి. చదువులో సారం తెలుసుకోవాలి. మీరు శ్రద్ధగా వినండి మీకో చిట్కా చెపుతాను."

అదేమిటో తనూ వినడానికి డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. పిల్లలందరు టీచర్ వైపు ఆసక్తిగా చూస్తున్నారు.

" ఏంలేదు చాలా సింపుల్, మూడు "స"లను గుర్తుంచుకోండి" అర్థంకానట్లు చూశారుపిల్లలు.

" అదేనర్రా- "స" ఓనమాలలోని య, ర, ల, వ, స లేదుఅ "స" అలాంటి మూడు "స" లను గుర్తుంచుకోండి "స" "స" "స" అయితే చెప్పండి అన్నట్టు చూస్తున్నారు.

" మొదటి "స" సత్యాన్ని పలుకు"

" రెండవ "స" సహనాన్ని పాటించు."

" మూడవ "స" సార్" చంద్రం అడిగాడు.

"చెపుతానర్రా- యిక మూడవ"స" సంతోషాన్ని పెంచు, పంచు,యిదర్రా మూడు'స'ల సూత్రం. పిల్లలందరు చప్పట్లు కొట్టారు. టీచర్ ముఖం కళకళలాడింది."ఓ విషయాన్ని,ఓ సారి సూత్రం ద్వారా చెప్తే త్వరగా తలకెక్కుతుంది.ఉదాహరణకి ఒకటి ఒకటి రెండు, ఒకటి ఒకటి జీరో."కరెక్ట్ సార్ యింకా యిలాంటివే చెప్పండి సార్" "అలాగే మూడు"నీ" లు ని,ని,ని, అప్పుడు టీచర్

కాస్త నవ్వును కలబోస్తు సరిగమలు పలికినట్లు పలుకుతూ కుడిచేత్తో తొడమీద దరువు వేసాడు. ఈ సారి, పిల్లల్లో ఉత్సాహం ఎక్కువైంది, ఏకాగ్రతతో టీచర్‌వైపు చూస్తున్నారు.

"సార్ ఒక ని గూర్చి చెప్పనాండి" కుడి చేయిని లేవనెత్తుతూ అన్నాడు అప్పటివరకు నోరెత్తని జాన్సన్. చెప్పు అన్నట్టు సైగ చేశాడు టీచర్. అందరు అతనివైపు చూస్తున్నారు. "ఒక ని, నీతిని మరవొద్దు" అంటూ కదా సార్ అన్నట్టు చూస్తున్నారు. "మరో ని ని నేను చెపుతాను సార్" అంటూ లేచి నిలుచున్నాడు మూర్తి. చెప్పు అన్నట్టు చూశారు అందరు. "ఇంతకుముందు బోర్డ్ చూశాం కదా సార్ నిదానంగా వ్యవహరించు అని అంటూ నవ్వుముఖం పెట్టాడు. టీచర్ అదివిని అతని సమయ స్ఫూర్తికి మెచ్చుకోలుగా కనుబొమ్మలు కదిలిస్తూ "శభాశ్" అంటూ కుడిచేతిని పైకెత్తి ఆశీర్వాదపు సైగ చేశాడు. "ఇకపోతే మూడవ "ని"ని గూడ మీరే చెప్పండి" అంటూ అందరి వైపు చూశాడు, అందరూ ఒకరి వైపు వొకరు ఆ తరువాత టీచర్ వైపు చూశారు.

హ చెప్పండి అన్నట్టు సైగ చేశాడు టీచర్.

మూడవ "ని" తట్టడం లేదు సార్, మీరే చెప్పండి అన్నాడు రెడ్డి అందరు అవునన్నట్టు చూశారు.

"మూడవ ని అతి ముఖ్యమైంది. నిరాడంబరంగా వుండాలి అంటే ఆడంబరాన్ని ప్రదర్శించవద్దు, మాటల్లోను చేతల్లోను నడకలోను, ప్రతి కదలికలోను సాదా సీదా తనం కనిపించాలి. దీనికి మంచి ఉదాహరణ, మన మాజీప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి గారు, వినోభాభావే గారు మొదలగువాళ్ళు మనం మన పూర్వీకులనుండి మంచిని గ్రహించి మన తరంలో ఆచరించి రాబోయే తరాలకు ఆదర్శంగా వుండి సత్ చరిత్ర నిర్మాణానికి పునాది రాళ్ళం కావాలి.

"సార్ ముందేదో కెనాల్ వస్తున్నట్టుంది యిక్కడే మనం మధ్యాహ్నం భోజనం సిద్ధం చేసుకుంటే" అన్నాడు డ్రైవర్.

కానీయండి అన్నట్టు చూశాడు టీచర్. కాలువ వొడ్డున వ్యాన్ ఆగింది.అందరూ దిగారు. కొందరు వంట పనిలో నిమగ్నం కాగ మరికొందరు కాలువ గట్టుమీద నిలుచోని పారేనీళ్లలోకి రాళ్ళు విసురుతున్నారు.విద్యార్థుల గుంపును చూసి రాళ్లు విసురగ ఏర్పడుతున్న నీటి వలయాలను చూసి వొడ్డున వున్న తాబేలు నీటిలోకి జారుకుంది.

దూరంగా పొలంలో కలుపుతీస్తున్న ఆడవాళ్లు పాటలు పాడుతున్నారు. ఎంతమంచిరాగం.ప్రతి పదాన్ని ముందు వొకరు పాడి వొదలగ,మిగతావాళ్లు ఒకేసారి అందుకుంటున్నారు. ఆ కలసిపాడే గొంతులలో అలసట పొగొట్టే ఉత్సాహం। పాట రాగమై పరుగులు తీస్తోంది.